సాక్షి
కర్నూలు
శుక్రవారం ; 17 ; నవంబర్ ; 2023



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి మూలన క్షత్రం సందర్భంగా ఊయలసేవను నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



కరువులో 'డ్రాగన్' సిరులు

కరువులో డ్రాగన్ ఫ్రూట్ సాగు కలసివస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. 8లో▸



క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. 8లో▸

పూస్తున్న 'మధుర' ఆశలు

- మామిడి తోటల్లో విచ్చుకుంటున్న మొగ్గలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వేల ఎకరాల్లో తోటలు
- పూత నిలబడాలంటే జాగ్రత్తలు పాటించాల్సిందే
- రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారులు



కర్నూలు(అగ్రికల్చర్): బంగినపల్లి మామిడి మధుర ఫలంగా పేరొందింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 15 వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. ఇప్పటికే చెట్లపై పూమొగ్గలు విచ్చుకుంటున్నాయి. డిసెంబరు చివరి నాటికి 30 శాతం పూత రావాల్సి ఉంది. ఉద్యాన శాఖ అధికారులు మామిడి తోటలకు వెళ్లి ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూత నిలబడి ఎకరాకు 7 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

బేనీసా తోటలే ఎక్కువ

గత ఏడాది మామిడిలో దిగుబడులు అంతంతమాత్రమే వచ్చాయి. ముందుగా పూత ఆశాజనకంగా వచ్చినప్పటికీ తర్వాత చోటు చేసుకున్న వాతావరణ మార్పులు రైతులను దెబ్బతీశాయి. దిగుబడులు పడిపోయినప్పటికీ ధరలు మెరుగ్గా ఉండటం రైతులకు ఊరటనిచ్చింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్, రబీ కలసి రాలేదు. దీంతో మామిడిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో బంగినపల్లి మామిడి (బేనీసా) తోటలు 80 శాతం వరకు ఉన్నాయి. హిమాం పసుందు, దీల్‌పసందు, నీలం, తోతాపురి తదితర రకాలు 20 శాతం వరకు ఉన్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో 5 వేల ఎకరాలు, నంద్యాల జిల్లాలో 10 వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఇప్పటికే వ్యాపారులు మామిడి తోటలు కొనుగోలు చేసి పూత బాగా వచ్చేందుకు అడ్డుగోలుగా అధిక గాఢత కలిగిన మందులు పిచికారీ చేస్తున్నారు. ఇలా చేయడం తోటలకు మేలు జరగకపోగా నష్టం ఎక్కువగా జరుగుతోంది.

అవగాహన అవసరం

మామిడి రెతులకు సాగు పద్ధతులపై అవగాహన ఉండాలి. ఎక్కువ మంది రైతులు మామిడిలో సేద్య పద్ధతులు పాటించకుండా పూత దశలో చీడపీడల నివారణకు మందుల పిచికారీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. వాతావరణ పరిస్థితులననుసరించి చీడపీడల తీవ్రతను అంచనా వేయవచ్చు. పూతను చీడపీడలు ఆశించిన తర్వాత నష్ట నివారణకు ఎన్ని రకాల మందులు వాడినా ఫలితం అంతంతమాత్రంగానే ఉంటుంది. దీనిని రైతులు దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల ఆధారంగా మామిడిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

తేలికగా దున్నటం ఎంతో మేలు

వర్షాలు ఆగిన తర్వాత నవంబరు, డిసెంబర్ నెలల్లో మామిడి తోటల్లో తేలికగా దున్నాల్సిన అవసరం ఉంది. దీని వల్ల భూమిలోని తేమ ఆవిరై బెట్ట పరిస్థితులు ఏర్పడి పూత ఆలస్యం కాకుండా యథాతథంగా వచ్చే అవకాశం ఉంది. భూమిలో తేమ ఎక్కువగా ఉంటే కొత్త చిగుళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇందువల్ల పూత రావడం ఆలస్యం అవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ సమయంలో చెట్ల మొదళ్ల దగ్గర దున్నడం వల్ల మామిడిని ఆశించే పురుగుల ప్యూపాలు, తెగుళ్ల అవశేషాలు బయటపడి నశిస్తాయి.

మండలాల వారీగా మామిడి తోటల విస్తీర్ణం వివరాలు..

మండలం	విస్తీర్ణం(ఎకరాల్లో)
డోన్	3,587
ప్యాపిలి	1,856
వెల్దుర్తి	1,275
ఓర్వకల్లు	948
బేతంచెర్ల	850
ఎమ్మిగనూరు	836
కృష్ణగిరి	813
గోనెగండ్ల	526
కర్నూలు రూరల్	505
రుద్రవరం	335
చాగలమర్రి	246
దేవనకొండ	183
కోడుమూరు	169
బనగానపల్లె	156

శుభ్రత ప్రధానం

మామిడిని ఆశించి తీవ్రంగా నష్టపరిచే పురుగులు, తెగుళ్లు చాలా వరకు తోటలోని కలుపు మొక్కలు, చెత్తాచెదారంలో ఆశ్రయం పొందుతాయి. మామిడి తోటల్లో కలుపు మొక్కలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

దీంతో పూత సమయంలో చీడపీడలను చాలా వరకు నియంత్రించుకోవచ్చు. మామిడి పూత రాకుండా ఉంటే ఉదయం పూట చెట్ల కింద మంట లేకుండా పొగ పెట్టాలి. ఇలా మూడు నాలుగు రోజులు చేస్తే పూత వస్తుంది.

పోషకాలు తప్పనిసరి

ఈశాన్య రుతుపవనాలు ఆగిపోయిన తర్వాత చలి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు మామిడిలో పూత రావడం ఆలస్యం అవుతుంది. తోటల్లో దున్నడం పూర్తి అయిన తర్వాత పోషకాలు పిచికారీ చేసి చెట్లలో పూమొగ్గలను ఉత్తేజ పరుచవచ్చు. ఇందుకోసం మల్టీ-కే(పొటాషియం నైట్రేటు లేదా 13-0-45)ఎరువును లీటరు నీటికి 10 గ్రాములు, యూరియా లీటరు నీటికి 5-10 గ్రాములు, అర్క మ్యాంగో స్పెషల్ సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. అర్క మ్యాంగో స్పెషల్ అందుబాటులో లేనపుడు ఫార్ములా-4 సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటికి 3 గ్రాములు కలపవచ్చు. ఈ మిశ్రమం మార్కెట్‌లో ఎఫ్-4, ఆగోమిన్ మ్యాక్స్‌అనే పేర్లతో లభిస్తుంది. సూక్ష్మ పోషకాలు పిచికారీ చేయడం వల్ల పూత బాగా రావడమే కాకుండా, ద్విలింగ పుష్పాలు అధికంగా వచ్చి.. ఎక్కువ పిందెలు ఏర్పడటానికి ఉపయోగపడుతుంది.

'తేనెమంచు'ను తరిమేద్దాం

మామిడిలో తేనెమంచు పురుగుల బెడద ఉంది. తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాడలు, పూలు, లేత పిందెల నుంచి విపరీతంగా రసాన్ని పీలుస్తాయి. లేత ఆకులను ఆశించినప్పుడు పూత మాడిపోతుంది. పిందెలు ఏర్పడవు. పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థం వల్ల ఆకులపైన, పూత కాడలపైన నల్లటి మసిపొర ఏర్పడుతుంది. దీనివల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియ జరగక కాయలు చిన్నగా ఉండి రాలిపోతాయి. నివారణకు మొదటి సారి లీటరు నీటికి 5 ఎంఎల్ వేపనూనె, రెండు గ్రాముల అసిపేట్ కలిపి పిచికారీ చేయాలి. రెండోసారి 0.4 ఎంఎల్ కాన్ఫిడార్, మూడు గ్రాముల బావిస్టన్, 5 ఎంఎల్ వేప నూనె కలిపి పిచికారీ చేయాలి.



మామిడితోటను పరిశీలిస్తున్న అధికారులు

జాగ్రత్తలు తీసుకోవాలి



పూతకు ముందు, పూత సమయం, కాయ పెరిగే దశలో అనేక రకాలైన పురుగులు, తెగుళ్ల ఆశించి మామిడి పంటకు అపార నష్టాన్ని కలుగజేస్తాయి. సరైన నీటి, పోషకాల యాజమాన్యం లేని తోటల్లో పిందెలు ఎక్కువ రాలిపోతాయి. దీంతో రైతులు బాగా నష్టపోతుంటారు. తగిన యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడితో పాటు మామిడికాయల నాణ్యతను పెంచి అధిక లాభాలను పెంచుకోవచ్చు. రైతులు ఉద్యాన శాఖ అధికారులు సలహాలు, సూచనలను పాటించాలి.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

పూత మొదలైంది



మేం 15 ఎకరాల్లో మామిడి తోటలను అభివృద్ధి చేసుకున్నాం. నాలుగైదేళ్లుగా మామిడి కలసి రావడం లేదు. దీంతో 5 ఎకరాల్లో తీసేశాం. ఇప్పుడు 10 ఎకరాల్లో మామిడి ఉంది. పూత రావడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటిస్తున్నాం. ఇప్పటికే మామిడితో పూత మొదలైంది. ముందుకు వచ్చిన పూత ఎంత వరకు నిలబడుతుందనేది అనుమానం. ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు కేవలం మామిడి మీదనే ఆశలు పెట్టుకున్నాం. – వి. వెంకటసుబ్బారెడ్డి, పాలకొలను, ఓర్వకల్లు మండలం

న్యూస్‌రీల్

పోలీసులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

- ఎస్పీ కృష్ణకాంత్



పోలీసుల వాహనాలు, హెల్మెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: వాహనాలు నడిపే పోలీసులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. అలాగే వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ధ్రువపత్రాలు కూడా దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు సమీపంలో ఉన్న కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన గల వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని, క్రైం రేట్‌ను తగ్గించేందుకు బాగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్పోజ్ చేయాలని సూచించారు. సీఐలు గుణశేఖర్ బాబు, శ్రీరాం, ఎస్ఐలు సమీర్ బాషా, రామయ్య తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

నేడు వ్యవసాయ సలహా మండలి సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఈ నెల 17న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగనుంది. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో వచ్చిన సమస్యలతో పాటు తాజా పరిస్థితులను కూడా చర్చిస్తారన్నారు.

సీపీఓగా హిమ ప్రభాకరరాజు బాధ్యతల స్వీకరణ



కర్నూలు(సెంట్రల్): చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీఓ)గా నియమితులైన హిమ ప్రభాకరరాజు గురువారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈయన గుంటూరులో ఏడీగా పనిచేస్తూ పదోన్నతిపై కర్నూలు సీపీఓగా నియమితులయ్యారు. ఇక్కడ సీపీఓగా ఉన్న ఎల్.అప్పలకొండను ప్లానింగ్ రాష్ట్ర శాఖ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆయన స్థానంలో హిమ ప్రభాకరరాజును నియమించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించాలని విద్యుత్ సిబ్బందికి దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజరు గురువయ్య సూచించారు. కర్నూలులోని పవర్ హౌస్ సబ్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న పురోగతి పనుల వివరాలు కర్నూలు ఎస్ఈ (ఆపరేషన్స్) ఎం. ఉమాపతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ల నిర్వహణపై దృష్టి సారించాలని, నెలవారి విద్యుత్ బిల్లుల వసూలో 100 శాతం లక్ష్యం సాధించాలన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పాత బకాయిలు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు సిటీ: విధులను నిర్లక్ష్యం చేసిన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఈఓ రంగారెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని మునగాల పాడు, నిడ్జూరు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను తాను తనిఖీ చేసినట్లు చెప్పారు. మునగాలపాడు హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులు, క్లాసు టీచర్ ట్యాబ్‌లను వినియోగించడం లేదని గుర్తించి ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు. నిడ్జూరు హైస్కూల్లో తెలుగు, ఇంగ్లిషు టీచర్లు విద్యార్థులకు నోట్సు ఇవ్వ లేదని గుర్తించి, షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

రవాణా శాఖ అధికారి ఇంట్లో ఏసీబీ సోదాలు





సువర్ణ కుమారి, ఆమె నివాసం



నగదును లెక్కిస్తున్న ఏసీబీ అధికారులు

కర్నూలు: రవాణా శాఖ నంద్యాల కార్యాలయ పరిపాలన అధికారి(ఏఓ) సువర్ణ కుమారి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏకకాలంలో ఆరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కర్నూలు కేంద్రీయ విద్యాలయానికి ఎదురుగా ఉన్న ధనలక్ష్మి నగర్‌లో ఆమె నివాసం ఉంటున్నారు. ఈమె సోదరుడు వరప్రసాద్ హైదరాబాద్, చెల్లెలు సుభాషిణి కర్నూలులోని రాగమయూరి, మరో సోదరి మార్కాపురంలో నివసిస్తున్నారు. వీరి ఇళ్లతో పాటు నంద్యాల ఆఫీసు, బనగానపల్లె (ఆర్‌టీఓ ఏజెంట్ రాజేంద్ర) ఇంట్లో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, వంశీనాథ్, శ్రీనివాసరెడ్డి, ఇంతియాజ్, అపర్ణ, కృష్ణయ్య తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఆమె నివాసముంటున్న ఇంట్లో దాదాపు రూ.10 లక్షల నగదు, 15 బ్యాంకు ఖాతాలు, భారీగా బంగారు, వెండి ఆభరణాలు బయటపడ్డాయి. ధనలక్ష్మి నగర్‌లో జీ+1 ఇంటితో పాటు కర్నూలు ఆంధ్రా బ్యాంకులో లాకర్, ఆరు ప్రాంతాల్లో విలువైన ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. 2005లో రవాణా శాఖలో ఈమె స్టెనోగా విధుల్లో చేరారు. ఎక్కువ కాలం కర్నూలు డీటీసీ కార్యాలయంలో పనిచేశారు. ఈమెకు ఉన్న ఆస్తులు సక్రమమైనవా, అక్రమంగా సంపాదించారా అనే కోణంలో అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్లు డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



సమీక్ష నిర్వహిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణ

కర్నూలు కల్చరల్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన కర్నూలు సర్కిల్ అటవీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు, అటవీ ప్రాంత ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలప అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. సీఏఎమ్‌పీఏ స్కీం అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. కర్నూలు ఇన్‌ఛార్జి డీఎఫ్ఓ నాగార్జున రెడ్డి, వైఎస్సార్ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, రెడ్ శాండల్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ రెడ్డి, నంద్యాల సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ వెంకటేశ్వర రావు, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్ఓ దివాకర్, ఎఫ్ఆర్‌వోలు, డీఆర్‌వోలు సమీక్షలో పాల్గొన్నారు.

అమల్లో సీఎం హామీ

- రూ.13.30 కోట్లతో పత్తికొండ నియోజకవర్గంలో బ్రిడ్జి, రెండు రోడ్లకు అనుమతులు

కర్నూలు(అర్బన్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పరనే ప్రజల్లో ఉన్న బలమైన నమ్మకం మరోసారి రుజువైంది. ఈ ఏడాది జూన్ 1న పత్తికొండకు వచ్చిన ఆయనను నియోజకవర్గంలోని పలు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. ఈ నేపథ్యంలోనే రూ.13.30 కోట్లతో ఒక బ్రిడ్జి నిర్మాణానికి, రెండు రోడ్ల అభివృద్ధికి పాలనా అనుమతులు మంజూరయ్యాయి. రూ.7.95 కోట్లతో కృష్ణగిరి మండలం టి.గోకులపాడు నుంచి రామక్రిష్ణాపురం వరకు హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి పాలనా అనుమతులు మంజూరు చేస్తు పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి.రాజశేఖర్ జీఓఆర్‌టీ నెం.782 జారీ చేశారు. అలాగే రూ.3 కోట్లతో అదే మండలం కోయిలకొండ నుంచి కంబాలపాడు వరకు బీటీ సర్ఫేస్ రోడ్డు నిర్మాణానికి, తుగ్గలి మండలం మారెళ్ల నుంచి నునుసురాళ్ల వరకు (వయా బొంది మడుగుల) బీటీ రెన్యూవల్స్‌కు రూ.2.35 కోట్లతో పాలనా అనుమతులు వచ్చాయి. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం పీఆర్ ఎస్ఈ కె.సుబ్రమణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పత్తికొండ నియోజకవర్గంలో హంద్రీ నదిపై ఒక బ్రిడ్జి, రెండు రోడ్లకు పాలనా అనుమతులు వచ్చాయన్నారు. ఈ పనులకు వెంటనే టెండర్లను పిలిచి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఉద్యోగుల 'ప్రత్యేక స్పందన' రద్దు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల కోసం ప్రతి మూడో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమం వర్చువల్‌గా ఉండడంతో రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించాలని కోరారు.

18 నుంచి పేదలకు భూ పంపిణీ

- జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ఈనెల 18 నుంచి వారం రోజులపాటు పేదలకు భూపంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. ప్రజాప్రతినిధులతో పట్టాలు పంపిణీ చేయించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. గురువారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో భూమిలేని 2,582మంది పేదలకు 3,002.18 ఎకరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అసైన్‌మెంట్ కమిటీ నిష్పక్షపాతంగా లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. అలాగే 20 ఏళ్ల అనుభవం ఉన్న అసైన్డ్‌దారులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3,103 మంది అసైన్డ్ భూములు ఉన్న రైతులకు సంబంధించి 5,781.375 ఎకరాలను నిషేధిత జాబితా 22ఏ నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే 23,838.92 ఎకరాల్లో అనుభవం ఉన్న సర్వీసు ఇనాం దారులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. 2008లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి లేని దళితులను గుర్తించి భూమి కొనుగోలు చేసి ఎంపిక చేసిన లబ్ధిదారులకు భూములు ఇచ్చారని, ఈ క్రమంలో వారిపేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు వివరించారు. అలాగే జిల్లాలో శ్మశానాలు లేని 103 దళిత వాడలకు 54.77 ఎకరాలను కేటాయించినట్లు ఆమె వివరించారు. కర్నూలు మండలంలోని నందనపల్లి, బాసపురం, ఆదోనిలలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం మూడు ఎకరాలను కేటాయించినట్లు చెప్పారు.

వాటర్‌షెడ్ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం



మాధవీలత

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాల అభివృద్ధి, ఉత్పాదకత పెంపు, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్(వాటర్‌షెడ్స్) ఎస్.మాధవీలత తెలిపారు. గురువారం వాటర్‌షెడ్స్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గూడూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఈమెకు ఇటీవల డివిజినల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)గా పదోన్నతి లభించింది. ఆ మేరకు డ్వామా వాటర్‌షెడ్ అదనపు పీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పొలాల్లో పంటలు ఉన్నందున వాటర్‌షెడ్ కార్యక్రమాలు జరుగడం లేదని, వచ్చే నెల నుంచి పెద్ద ఎత్తున చేపడతామన్నారు.

సంక్షేమ బావుటా



నాణ్యమైన విద్య అందుతోంది



మా కుమార్తె హాజిరాబీ కృష్ణగిరిలోని మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. కుమారుడు ఫిరోజ్‌ఖాన్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పిల్లల చదువుల కోసం ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తోంది. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా వస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. – ఫాతిమాబీ, గోకులపాడు, కృష్ణగిరి మండలం

కల నేరవేరుతోంది

ఎనిమిదేళ్లుగా బాడుగ ఇంట్లో ఉంటున్నాం. చాలీచాలని సంపాదనతో ఇబ్బందులు పడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మాకు రూ.లక్షల విలువైన ఇంటి స్థలం మంజూరు చేసింది. ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తోంది. మేం బేస్‌మట్టం వరకు ఇంటి నిర్మాణం చేసుకున్నాం. మొదటి బిల్లు రూ.70 వేలు వచ్చింది. సొంతింటి కల నేరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– మొల్లా రహింబీ, గడివేముల



జబ్బు నయమైంది



నేను ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ భార్య, కొడుకు, బిడ్డను పోషిస్తున్నాను. మాది పేద కుటుంబం. కంటి పొర రావడంతో కొంతకాలంగా నాకు చూపు మందగించింది. మా కాలనీలో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహిస్తుందని తెలుసుకుని వెళ్లాను. డాక్టర్ కంటి పరీక్షలు బాగా చేశారు. ఉచితంగా మందులు ఇచ్చారు. కొంతవరకు జబ్బు నయమైంది.

– బి.శ్రీనివాసులు, భరత్‌నగర్ కాలనీ, ఆదోని

గ్రామ స్థాయిలో గ్రంథాలయ సేవలు


మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ సేవలను గ్రామ స్థాయిలో విస్తరిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాలను ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా జరుపుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా పుస్తక పఠనం చేస్తే విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క, నైస్ కంప్యూటర్స్ అధినేత రాయపాటి శ్రీనివాస్, లైబ్రేరియన్లు వజ్రాల గోవింద రెడ్డి, బాషా, చంద్రమ్మ, నిఖిలేష్ అకాడమీ సంస్థ అధ్యక్షులు మద్దిలేటి, సీనియర్ కళాకారులు హెచ్.చంద్రన్న, రాజారత్నం, సహదేవరెడ్డి, తెలుగు బాషా వికాస ఉద్యమ కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ పాల్గొన్నారు.

కరువులో 'డ్రాగన్' సిరులు

- కలసి వస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగు
- ట్రెల్లీస్ విధానంలో రాణిస్తున్న రవీంద్రకుమార్
- రెండేళ్లలో 6 టన్నులకుపైగా దిగుబడి
- అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం


ట్రెల్లీస్ విధానంలో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ తోట

కర్నూలు(అగ్రికల్చర్): కరువులో డ్రాగన్ ఫ్రూట్ సాగు కలిసివస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. గతంలో ఒకరిద్దరి రైతులకే పరిమితమైన తోటలు ఏడాదికేదాది అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసే రైతుకు గరిష్ఠంగా రూ.1.90 లక్షలు సబ్సిడీ ఇస్తోంది. గతంలో దిమ్మెలు పాతి దానిపై టైర్/బండి చక్రం అమర్చడం ద్వారా మొక్కలు పైకిపాకే ఏర్పాటు చేసేవారు. నేడు ట్రెల్లీస్ విధానంలో(దిమ్మెలపై టైరు/ బండి చక్రం అవసరం లేకుండా తీగలతో) తోటలు అభివృద్ధి చేస్తున్నారు.

మొదటి పంటలోనే రూ.6 లక్షల ఆదాయం

దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన కంది రవీంద్రకుమార్ యాదవ్ ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఈయన కేవలం 10వ తరగతి వరకు చదువుకున్నారు. మొదటి పంటలోనే రూ. 6 లక్షల ఆదాయం పొందారు. నరసరావు పేట నుంచి మొక్క రూ.60 ప్రకారం తెప్పించి 2021లో నాటుకున్నారు. సాలుకు, సాగుకు మధ్య 14 అడుగులు, దిమ్మెకు, దిమ్మెకు మధ్య 14 అడుగుల దారంలో పోల్స్ నాటుకున్నారు. పోల్స్‌కు విద్యుత్ లైన్ తరహాలో 4 వరుసలతో లైన్ వేశారు. పోల్స్ కింద ఒకదానిపైన ఒకటి ప్రకారం మూడు వైర్లు లాగారు. ఈ వైర్ల కింద అడుగు, అడుగు దూరంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటుకున్నారు. మొక్కలు తీగ తరహాలో పైకి పెరుగుతూ... పైన వేసిన నాలుగు లైన్‌లు వేసి తీగలపై అల్లుకున్నాయి. దిమ్మెలపై టైరు/బండి చక్రం అవసరం లేకుండా పోయింది. ఎకరన్నర భూమిలో ఏకంగా 7వేల మొక్కలు నాటుకోగా.. పెట్టుబడి వ్యయం రూ.16 లక్షల వరకు వచ్చింది.

అంతరపంటగా వేరుశనగ

సాలుకు, సాలుకు మధ్య 14 అడుగులు ఉండటంతో ట్రాక్టరుతో సేద్యం చేసుకోవచ్చు. ప్రతి ఏటా అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలకు ఆకులు రావు. తీగలపైనే అల్లుకుంటాయి. మధ్య ఖాళీగా ఉన్న భూమిలో అంతరపంటగా వేరుశనగ సాగు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ తోటకు మల్చింగ్ సదుపాయం కూడా కల్పించుకున్నారు. దీంతో కలుపు సమస్య లేకుండా పోయింది. తేమ కూడా ఆరిపోదు.. ప్లాస్టిక్ షీట్లకు అడుగు, అడుగు దూరంలో రంధ్రాలు వేసి మొక్కలు నాటారు. మల్చింగ్ వల్ల మొక్క ఆరోగ్యంగా పెరుగుతోంది. ఏపీఎంఐపీ ద్వారా సూక్ష్మ సేద్యం కల్పించుకున్నారు.

ఐదేళ్ల నుంచి పెరగనున్న దిగుబడులు

పంటకు కేవలం పశువుల ఎరువులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. నాటిని ఏడాదిలోపే 2022 అగస్టులో కాపు మొదలైంది. మొదటి పంటలో కేవలం 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. 2023లో దిగుబడి బాగా పెరిగింది. ఈ ఏడాది జూన్‌లో మొదలైన పంట నవంబరు నెలతో ముగింపునకు వస్తోంది. ఈ ఏడాది ఏకంగా 60 క్వింటాళ్ళు దిగుబడి వచ్చింది. టన్ను రూ.లక్ష ప్రకారం విక్రయించారు. ఇప్పటి వరకు రూ.6 లక్షలకుపైగా ఆదాయం పొందారు. వచ్చే ఏడాది మొక్కకు 20 వరకు పండ్లు వస్తాయి. ఇవి 4 కిలోల వరకు ఉంటాయి. ఈ ప్రకారం 28 టన్నుల వరకు దిగుబడి పెరుగనుంది. నాటిన ఐదేళ్ల నుంచి దిగుబడి గరిష్టస్థాయికి చేరుతుంది.

మూడు నెలలు అధ్యయనం చేశా



డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు చేసే ముందు మూడు నెలలు అధ్యయనం చేశా. ఒక అవగాహనకు వచ్చాక ట్రెల్లీస్ విధానంలో మొక్కలు నాటుకున్నా. మల్చింగ్, పోల్స్, వైర్లు, మొక్కలు తదితర వాటికి పెట్టుబడి కింద రూ.16 లక్షల ఖర్చు వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రూ.1.90 లక్షల సబ్సిడీ ఇచ్చింది. ఏపీఎంఐపీ కింద డ్రిప్ కూడా మంజూరైంది.

– కంది రవీంద్రకుమార్ యాదవ్

సాగును ప్రోత్సహిస్తున్నాం



డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహిస్తున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులకు గరిష్టంగా రూ.1.90 లక్షలు సబ్సిడీగా ఇస్తున్నాం. దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన రవీంద్రకుమార్ డ్రాగన్ ఫ్రూట్ సాగులో రాణిస్తున్నారు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌వోగా పీరయ్య

కర్నూలు కల్చరల్: కర్నూలు ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌వోగా పీరయ్యకు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎఫ్‌ఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఎం.సూర్యచంద్ర రాజు అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్)గా పదోన్నతి పొంది నంద్యాల జిల్లా డోన్ డివిజన్‌కు నియమితులయ్యారు. దీంతో కర్నూలు డివిజన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న పీరయ్యను ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు మోసం

- పోలీసులకు ఫిర్యాదు చేసి బాధితులు

ఆదోనిఅర్బన్: ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు మోసం జరిగిందని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్‌కు ఎంఎం కాలనీకి చెందిన సూర్య, మాధవ్, మురళీమోహన్, నాగశైన ఫిర్యాదు చేశారు. తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటోస్ పెట్టి ఫేక్ మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్‌తో క్రెడిట్ కార్డు తీసుకుని 2021 డిసెంబర్ 17, 19వ తేదీల్లో రూ.13,500 డ్రా చేశారని, దని యాప్ వారు తమను డబ్బు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. వడ్డీతో కలిపి రూ.25 వేలు కట్టాలంటున్నారని సీఐకు వివరించారు. సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి తమకు ఎఫ్ఐఆర్ కాపీని ఇస్తే వెంటనే క్రెడిట్‌కార్డును ఆపి వేస్తామని, రికవరీ ఏజెంట్లు తెలిపారని బాధితులు సీఐకు తెలియజేశారు.

పోలీసు శాఖపై నిరాధారణ ఆరోపణలు సహించేది లేదు

- ఎస్పీ రఘువీర్‌రెడ్డి



బొమ్మలసత్రం: నిరంతరం జిల్లా ప్రజల శాంతిభద్రతలో విరామం లేకుండా విధులు కొనసాగిస్తున్న పోలీసు శాఖ ప్రతిష్ఠ దిగజార్చేలా నిరాధారమైన కథనాలు పత్రికల్లో ప్రచురిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలో గత ఆరు నెలల క్రితం చిన్నబాబు అనే యువకుడు తన వ్యక్తిగత కారణాల వల్ల రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బైక్ దొంగతనం కేసులో చిన్నబాబును పోలీసులు కావాలనే ఇరికించి చేయని నేరాన్ని ఒప్పుకోవాలని బలవంతం చేసినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైందన్నారు. తన కుమారుని ఆత్మహత్యకు పోలీసులు కారణం కాదంటూ చిన్నబాబు తల్లి సంఘటన జరిగిన రోజే మీడియా ఎదుట ఒప్పుకున్నారని, అయినా పోలీసులే తప్పు చేశారని అవాస్తవాలు రాయటం సమంజసం కాదన్నారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీ గోస్పాడు మండలం చింతకుంట గ్రామానికి చెందిన బాలనరసింహుడు తన వ్యక్తిగత కారణాలతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆంధ్రజ్యోతి పత్రికలో పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చేలా నిరాధారమైన వార్తలను ప్రచురించటం సరైందికాదన్నారు. బాలనరసింహుడును గోస్పాడు పోలీసులు దూషించి, కొట్టారని పత్రికలో నిరాధారమైన వార్తను ప్రచురించారని పేర్కొన్నారు. బాధితులు చెప్పిన వాస్తవాలను రాయకుండా వాటికి విరుద్ధంగా ఆంధ్రజ్యోతి అవాస్తవాలు ప్రచురించడం సరి కాదని ఇకపై ఇదే కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక బీక్యాంప్ క్రీడా మైదానంలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రతిభ చాటుతున్న క్రీడాకారులకు నగదు పారితోషికాలు అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అంతకుముందు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేస్తూ అతిథుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ పోటీల పరిశీలకులు విజయ్ కుమార్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కర్నూలు జట్టు శుభారంభం...

అండర్-19 బాలుర విభాగంలో కర్నూలు బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 16-8 గోల్స్ సాధించింది. అనంతపురం జట్టు గుంటూరు జట్టుపై 6-4 గోల్స్ సాధించింది. కడప జట్టు ప్రకాశం జట్టుపై 15-5 గోల్స్‌తో గెలుపొందింది. కృష్ణా జిల్లా జట్టు చిత్తూరు జట్టుపై 11-9 గోల్స్ ఆధిక్యంతో గెలుపొందింది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విశాఖపట్నం జిల్లా జట్టుపై 5-1 స్కోర్‌తో గెలుపొందింది. గుంటూరు జట్టు కర్నూలు జట్టుపై 6-3 గోల్స్ ఆధిక్యత సాధించింది. కృష్ణా జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై 13-4 గోల్స్ తేడాతో గెలుపొందింది.


పోటీల ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

99 శాతం ఎన్నికల హామీల అమలు

- విలేకరుల సమావేశంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఏకైక సీఎం దేశంలోనే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గోకుల సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనను సంక్షేమం, పాలన సంస్కరణలు, అభివృద్ధి, పరిశ్రమలుగా విభజించి చూడాలన్నారు. ఇందులో సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.2.50 లక్షల కోట్లు పేదల కోసం వారి ఖాతాల్లో డీబీటీ పద్ధతిలో ట్రాన్స్‌ఫర్ చేశారని, చేస్తున్నానే ఉన్నారన్నారు. ఒకే సమయంలో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2.50 లక్షల వలంటీర్ల నియామకం చేపట్టడం రికార్డు విషయమన్నారు. ఒకటో తేదీనే ఠంచన్‌గా వలంటీర్ల ద్వార పెన్షన్‌ను అందజేస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రేరీలు తదితర 50వేల భవనాలు కొత్తగా అందుబాటులోకి రావడం అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా రైతులకు కావాల్సిన సాంకేతిక, విత్తనాలు, ఎరువులు అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు అమరావతిలో రియల్ ఎస్టేట్ చేస్తే.. వైఎస్ జగన్ రియల్ అభివృద్ధి చేసి చూపుతున్నారన్నారు. తాను 50 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితులను దగ్గరుండి చూస్తున్నానని, ఈ స్థాయిలో ఏ ప్రభుత్వంలోనూ అభివృద్ధి జరుగలేదన్నారు. అందుకోసమే తాను ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ అని అంటున్నానని.. దీనిపై చర్చకు తాను సిద్ధమన్నారు.

నిబంధనల సడలింపుపై ప్రభుత్వంతో చర్చిస్తా..

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ కేబినెట్‌లో చర్చించడం, జీఓ ఇచ్చారన్నారు. అయితే కొన్ని అంశాలను సడలించాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విలేకరుల సమావేశంలో డీడీ జయమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: పర్యాటక శాఖ మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక రంగాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిణి విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన రంగాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. www.rural.tourism. gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఎంపికైన బెస్ట్ రూరల్ టూరిజం విలేజెస్‌ను రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పురస్కారాలు అందజేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9977191550 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయండి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): యువతలో నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసి వివిధ రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. గురువారం కర్నూలు శివారులోని డీఆర్‌డీఏ-వైకేపీ శిక్షణ కేంద్రంలో రాయలసీమ జిల్లాలకు చెందిన సీడాప్, వాద్వాని ఆధ్వర్యంలో ఫెసిలిటేటర్‌లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యువత అభ్యున్నతికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాబ్ మేనేజర్ కిరణ్, వాద్వాని ఫౌండేషన్ ప్రతినిధి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితాపై ముమ్మర పరిశీలన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాపై ముమ్మర పరిశీలన సాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా విజయవాడ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఓటరు సవరణ జాబితా సంక్షిప్త సవరణ-2024పై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి 36,773, ఫారం-7కు 24,816, ఫారం-8కు సంబంధించి 17,592 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. రాజకీయపార్టీలు లేవనెత్తిన అంశాలను మినిట్ రూపంలో ప్రతి వారం అప్‌లోడ్ చేస్తున్నామని వివరించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై శనివారంలోపు విచారణ చేస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదనరావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, ఈఆర్‌ఓలు మల్లికార్జునుడు, రమ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ఆప్షన్- 3 ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

జగనన్న కాలనీల్లో ఆప్షన్-3 కింద నిర్మిస్తున్న ఇళ్లలో పురోగతి కనిపంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గ్రౌండింగ్‌లో హాలహర్వి మండలం తప్ప మిగిలిన మండలాల్లో పురోగతి లేదన్నారు. వచ్చే సోమవారం నాటికి పురోగతి 95 శాతం కంటే తక్కువగా ఉంటే సంబంధిత మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేకు సంబంధించి అప్పీల్స్ ఎందుకు రావడం లేదని అధికారులను ప్రశ్నించారు. డిసెంబర్ 15లోపు ఆడుదాం ఆంధ్ర పోటీలను సచివాలయాలు వారీగా మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాఠశాలలు, కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వివరించారు. గురువారం సాయంత్రం సీఎస్ విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతం బాగా వెనుకబడి ఉందని కలెక్టర్ వివరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొందరు విద్యార్థులు బడికి రావడంలేదని సర్వే తేలిందన్నారు. జిల్లాలో టీచర్ల కొరత ఉందని, ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని సీఎస్‌కు విన్నవించారు. ఈ ప్రాంతానికి నైపుణ్య శిక్షణ ప్రత్యేకంగా ఇవ్వాల్సి ఉందని ఆమె వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ రంగారెడ్డి, సీపీఓ హిమ ప్రభకార రాజు, డీపీఓ నాగరాజు నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	3000	7632
పొద్దుతిరుగుడు	4489	5019
ఆముదం	4089	5459
వాము	15110	17868
ఉల్లి	517	3898
ఎండుమిర్చి	6999	22799
శనగలు	5769	5770
కందులు	10211	10211
మొక్కజొన్న	1819	2129
మినుములు	8409	8901
కొర్రలు	5719	5719
సోయాచిక్కుడు	1401	4601